
# జీవితం

యస్.ఓ.వి.అజీజ్

హోటల్ మూసేసి, ఆరోజు జరిగిన కలెక్షన్ లెక్కపెట్టుకొంటూ వుండగా, మంగమ్మను అడిగాడు ఆమెకింద పనిచేసే రత్తయ్య. "అక్క ఈరోజు కలెక్షన్ ఎంతయ్యింది ఏంటి?" అంటూ.

"ఏం కలెక్షన్ లేరా! రాను రాను యాపారం డౌన్ అయిపోతా వుంది. ఎదురుగా ఆ సుబ్బయ్యగాడు హోటల్ పెట్టిన కాడ్నుంచి మనకు సరిగా గిరాకే లేదు. వాడు ఏం మంత్రం వేశాడో ఏమో? కస్టమర్స్ అంతా ఆడికేపోతున్నారు." నిరుత్సాహంగా పలికింది మంగమ్మ.

"వాడు వేసిన మంత్రమేమిటో నాకు బాగా తెలుసక్క! ఈడొచ్చిన తన కూతుర్ని కాష్ కౌంటర్ దగ్గర కూర్చోబెట్టాడు. ఆ పిల్ల కాస్త, ఎర్రగా బుర్రగా వుండేసరికి చొంగకార్చేనాయాళ్లంతా అటే ఎల్తున్నారు. అక్కా! మనం కూడా ఓ మాంచి పిల్లను చూసి క్యాష్ కౌంటర్ దగ్గర కూర్చోబెడదాం! నువ్వు ఊం అను.. తాగుబోతు మల్లయ్య కూతుర్ని తెచ్చి కూర్చోబెడతా! అందుకుగాను రోజుకో యాభై ఇస్తానంటే, ఆ మల్లయ్య గాడే తన కూతుర్ని ఈడ్చుకొచ్చి కూర్చో బెడతాడు.. తన మనసులోని ఆలోచనను చెప్పాడు రత్త య్య.



"ఆపిల్ల చదువుకొంటూ వుందిరా! వద్దు! మనం బతకటం కోసం, ఇంకొకరి బతుకును నాశనం చేయరాదు. గిరాకి జరిగిన కాడికి జరుగుతుంది. అయినా మన గిరాకీ మరీ అంత పడిపోలేదు కదరా! మన తిండికి, బట్టకు జరిగిపోతూ వుంది. కాకపోతే మునుపట్లా ఎక్కువ ఆదాయం రావటం లేదంతే!" అంది మంగమ్మ కలెక్షన్ లెక్క చూసుకొంటూనే.

"ఇట్లా అనుకొంటే మనం హోటల్ మూయాల్సి వస్తుందక్క. నామాట ఇను రేపే ఆ మల్లయ్య గాడితో మాట్లాడతా!" అంటూ మంగమ్మను ఒప్పించే ప్రయత్న చేశాడు రత్తయ్య.

"వద్దురా! ఆడదాని వొంపు సొంపులు చూపించి, చేసే యాపారం కంటే నీచమయ్యింది మరొకటి లేదు. బాగా పొద్దుపోయింది. నువ్వెళ్ళి పడుకో." అంటూ కలెక్షన్ లెక్కపూర్తి చేసుకొని ఆ రోజు ఎంత జరిగిందో ఓ పుస్తకంలో వ్రాసుకుని, కలక్షన్ డబ్బును ట్రంక్ పెట్టెలో వుంచి తాళం వేసింది. ట్రంకు పెట్టె పక్కనే వున్న పక్కపై నడుం వాల్చింది. లఘు శంక తీర్చుకోని పడుకొందామని హోటల్‌నుంచి బయటికొచ్చిన రత్తయ్యకు, రోడ్డుకు ఆవల వున్న బోరింగ్ దగ్గర ఓ వ్యక్తి పడి వుండటం అగుపించింది. లంఘు శంక తీర్చుకొని వెళ్ళి నిద్రలోకి జారుకోబోతున్న మంగమ్మతో చెప్పాడు.

"అక్కా! రోడ్డవతల బోరింగ్

> **ఇన్నాళ్ళు నీకు నీవుగా చెబుతావేమోనని, నీ గురించి మళ్ళీ మళ్ళీ అడగలేదు. ఇప్పుడు అడుగుతున్నాను. నిజం చెప్పు! నువ్వెవరివి? చూస్తే బాగా చదువుకొన్నవాడిలా వున్నావు. మీ వూరేది? నీకు జీవితంపై ఎందుకు విరక్తి కలిగింది?**


కాడ ఎవరోపడున్నారు.''

''ఎవడో ఫుల్‌గా తాగి పడుంటాడులే. నువెళ్ళి పడుకో.'' అంది మంగమ్మ.

''చచ్చాడో, బతికాడో ఓసారి వెళ్ళి చూసొస్తా.'' మంగమ్మను ఉద్దేశించి అన్నాడు రత్తయ్య.

''ఎవడు ఎట్లా పడిపోతే మనకెందుకురా! నువెళ్ళి పడుకో!'' విసుగ్గా అంది మంగమ్మ.

''ఇప్పుడే ఇట్లా పోయి, అట్లా చూసొస్తా.'' అంటూ తిరిగి హోటల్ బయటికి వచ్చి, రోడ్డుదాటి బోరింగ్ దగ్గరికి వెళ్ళాడు. పక్కనే పడున్న వ్యక్తిని కదిపాడు. స్పృహతప్పి పడున్నాడు. ముక్కు దగ్గర వేలెట్టి చూసి బతికే వున్నాడని నిర్ధారించుకుని, 'అలాగే పడి వుంటే చచ్చి పోవచ్చు.' అని భావించి భుజాన ఎత్తుకొని, హోటల్లోకి తెచ్చి, తాను పడుకొనే చాపపై పడుకో బెట్టాడు. ఇదంతా గమనించిన మంగమ్మ ''దారినపోయే దరిద్రాన్ని తలకెత్తుకోవటం అంటే ఇట్లాగే వుంటుంది. వీడెవడో ఏమో? వీడికేమయినా అయితే మన పీకలకొస్తాది. తీసుకెళ్లి అక్కడే పడుకోబెట్టిరా!'' కోపంగా పలికింది మంగమ్మ.

''చూస్తూ వూరికే ఎట్లా వుండడమక్క...'' అంటే మగ్గులో నీళ్లు తెచ్చి ముఖంపై చిలకరించాడు. అలా అయిదారు సార్లు చిలకరించాక, స్పృహ తప్పిన వ్యక్తిలో మెల్లిగా చలనం వచ్చింది. రత్తయ్యలో ఆనందం. ఆ వ్యక్తిని ఉదయం చూసినట్లుగా గుర్తు తెచ్చుకుంది మంగమ్మ. రత్తయ్యతో అంది.

''రేయ్! వీడు ఉదయం మన హోటల్ కాడికొచ్చి ఆకలిగా వుంది రెండిడ్లిమ్మని అడిగాడు. నేను లేదుపొమ్మని కసురుకొన్నాను''.

''నువ్వు చెప్పిందాన్నిబట్టి చూస్తే, ఇతను తాగి స్పృహతప్పిపడిపోలేదక్క! తిండి లేకే తెలివి తప్పాడు. పాపం! అన్నం తిని ఎన్నాళ్ళయ్యిందో ఏమో?'' నిట్టూర్పు విడిచి పలికాడు రత్తయ్య. చలనం రాగానే, ఆ వ్యక్తి మెల్లిగా కళ్ళు తెరచి చూశాడు. తన వంకే చూస్తోన్న మంగమ్మ, రత్తయ్య అగుపించారు.

***

రత్తయ్య అతనికి మిగిలివున్న అన్నాన్ని పెట్టి కాస్త సేద తీరాక, అతని వంక అనుమానంగా చూస్తూ అడిగింది మంగమ్మ.

''ఏవూరు మంది? ఏంటి కత? ఇంట్లో నుంచి పారిపోయి వచ్చావా? లేక దొంగతనమో, ఖూనో చేసి దొరక్కుండా ఇట్లా వూళ్ళు పట్టుకొని తిరుగుతున్నావా?''

''నేనలాంటివాడ్ని కాదండి.'' చెప్పాడతను.

''మరెందుకు ఇట్లా వూళ్ళవెంట పడ్డావు. ఇంట్లో పోట్లాడి వచ్చావా?''

''లేదు.'' జవాబిచ్చాడు అతను.

''మరి?'' అడిగింది మంగమ్మ.

''జీవితం పై విరక్తి కలిగి.'' సమాధానమిచ్చాడు అతను.

''జీవితంపై విరక్తి కలిగితే, ఏ ఏట్లో దూకో, రైలు కింద తలపెట్టో, పురుగుల మందో తాగి చావాలి గాని, ఇట్లా వూళ్ళు పట్టుకొని తిరిగితే ఏంటి లాభం?'' అంది మంగమ్మ.

''నువ్వుండక్క.. ఎప్పుడు తిన్నాడో ఏమో? ఇప్పుడే కాస్త ఎంగిలి పడ్డాడు. అప్పుడే ప్రశ్నలమీద ప్రశ్నలు వేసి బెదరగొట్టేస్తున్నావు.'' అంటూ మంగమ్మ మాటలను అడ్డు తగిలి అతని వంక చూస్తూ అడిగాడు రత్తయ్య.

''నువ్వేం అనుకోమాకు. మా అక్కమాట తీరే అంతా! మాట కటువుగా వున్నా మనసు మాత్రం వెన్న.. నీ పేరేంటి?''

''ప్రసాద్'' బదులిచ్చాడు అతను.

''పస్తులుండి శోష వచ్చి ఎక్కడబడితే అక్కడ పడిపోయే బదులు ఏదైనా పని చేసుకొని బ్రతకరాదు.'' కల్పించుకుంటూ అంది మంగమ్మ.

''పనికోసం చాలా చోట్ల వెతికాను. ఎవ్వరూ ఇవ్వలేదు. మీ హోటల్లో పనిచేస్తాను. కాస్త అన్నం పెడితే చాలు. డబ్బవసరం లేదు.'' మంగమ్మ వంక చూస్తూ అడిగాడు ప్రసాద్.

మంగమ్మ మౌనం వహించింది.

''అక్కా! నేనొక్కడ్నే కస్టమర్లకు కాఫీ, టీలు, టిఫిన్లు సప్లయ్ చెయ్యలేక చస్తున్నా! ఇతన్ని పనిలో వుంచుకొంటే, నాకు కాస్త తోడుగా వుంటాడు. కాదనకక్క!''

రత్తయ్య మాటలకు మెత్తపడ్డ మంగమ్మ ప్రసాద్‌తో ఇలా అంది.

''ఇదిగో చూడూ! మావాడు చెబుతున్నాడు కాబట్టి, నీవెవరివో తెలియకపోయినా పనిలో పెట్టుకొంటున్నాను. వూరికే అన్నం పెట్టి పనిచేయించుకోవటం నాకిష్టముండదు. అన్నంపెట్టి రోజు పదిరూపాయలు ఇస్తాను.''

''అలాగే'' అంగీకారంగా తలూపాడు ప్రసాద్.

''పొద్దునే అయిదింటికి లేవాలా!''

''మీ ఇష్టం. మీరు ఎన్నింటికి లేవమంటే అన్నింటికి లేస్తాను.'' చెప్పాడు ప్రసాద్.

రత్తయ్యకు చెప్పింది మంగమ్మ.

''ఆ మూల వున్న పాత చాప.. ఓ దుప్పటి ఇవ్వు!.. ఇతని బట్టలు మాసిపోయి వున్నాయి. నీ దగ్గరున్న బట్టల్లోంచి ఓ జత బట్టలు తీసివ్వు! ఈ మురికి బట్టల్తో పనెలా చేస్తాడు.. వెళ్ళవయ్య.. వెళ్ళి అతనితో పాటు పడుకో!'' అంది మంగమ్మ.

''రావయ్యా'' అంటూ రోజూ తాను పడుకొనే చోటుకు తీసుకెళ్ళిడు రత్తయ్య.

ఇద్దరు హోటల్లో క్యాష్ కౌంటర్ పక్కన వున్న బెంచీలు జరిపి, చాపలు వేసుకొని నిద్రకు ఉపక్రమించారు. వారు పడుకోవడానికి వెళ్ళిపోయాక, నిద్రలోకి జారుకొంటూ స్వగతంగా అనుకొంది మంగమ్మ.

''ఏమిటో ఈ లోకం. ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మరాదో తెలిసి చావటం లేదు.''

***

ఓ నెల రోజులు గడిచాయి.

చెప్పిన ప్రతి పనిని చకచక చేసేస్తున్నాడు ప్రసాద్. కస్టమర్స్‌కు ఐటమ్స్ సప్లయ్ చేయటంలోనూ, టేబుల్స్ క్లీన్‌గా వుంచటంలోనూ, బయటికెళ్ళి సరుకులు తేవటంలోనూ, చివరికి కలెక్షన్ అయిన డబ్బు లెక్కకట్టి నోట్‌బుక్‌లో వ్రాసి ఆ డబ్బు మంగమ్మకు అందజేయటం వరకు. రత్తయ్యలా బీడి తాగే అలవాటు కూడా లేదని, తాగుడు అలవాటు కూడా లేదని తెలుసుకొంది మంగమ్మ.

ఓ రోజు...

రత్తయ్యను అడిగింది.

''అతను తన గురించి ఏమైనా చెప్పాడా?''

''నేనడగ లేదక్క..'' బుర్రగోక్కుంటూ బదులిచ్చాడు రత్తయ్య.

''నువ్వో చవట సన్నాసివి.'' అని విసుక్కొంది. తానే అడిగేయాలని నిర్ణయించుకొంది. ఓ రాత్రి నిద్ర పట్టక హోటల్ ముందున్న అరుగుపై కూర్చొని ఆకాశం వంక చూస్తోన్న ప్రసాద్ వద్దకు వెళ్ళి అడిగింది మంగమ్మ.

''ఏమిటి ఆకాశం వంక చూస్తూ ఆలోచిస్తున్నావు?''

''అబ్బే ఏంలేదు.''

''ఇన్నాళ్ళు నీకు నీవుగా చెబుతావేమోనని, నీ గురించి మళ్ళీ మళ్ళీ అడగలేదు. ఇప్పుడు అడుగుతున్నాను. నిజం చెప్పు! నువ్వెవరివి? చూస్తే బాగా చదువుకొన్నవాడిలా వున్నావు. మీ వూరేది? నీకు జీవితంపై ఎందుకు విరక్తి కలిగింది?''

తన గురించి చెప్పకపోతే, తనపై అనుమానం పెంచుకునే అవకాశం వుందని భావించిన ప్రసాద్ తన గురించి ఇలా చెప్పుకొచ్చాడు.

మాది ఓ పల్లె. మా అమ్మ నాన్నకు మేమిద్దరం అన్నాదమ్ములం. మా నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. మా అమ్మే మమ్మల్ని పెంచి పెద్ద చేసింది. మా అన్నయ్య పెళ్ళయ్యాక వేరే కాపురం పెట్టాడు. నేను సిటీలో వుండి చదువుకుంటూ వుండేవాన్ని! నాకక్కడ నీరజ అనే అమ్మాయితో పరిచయం అయ్యింది. ఇద్దరం ఒకరికొకరం ఇష్టపడ్డాం! అయితే, నీరజ, తల్లిదండ్రులు మా వివాహానికి అంగీకరించలేదు. నీరజకు బలవంతంగా మరో వ్యక్తితో పెళ్ళి జరిపించి, అత్తవారింటికి పంపించేశారు. నీరజ నాది కాలేకపోయినందుకు చాలా బాధపడ్డాను. కొన్నాళ్ళు జరిగాక ఓ రోజు.. తలవని తలంపుగా, నీరజ నా దగ్గరికి వచ్చింది.

''నేను తన భర్తతో కాపురం చేయలేనని ఎటయినా వెళ్ళిపోదాం!'' అంది.

''పెళ్ళయిన దానివి. ఇలా రావటం మంచిది కాదు..'' అని నేను ఎంత సర్దిచెప్పినా వినిపించుకోలేదు. ఆత్మహత్య అయినా చేసుకుంటాను గాని, తిరిగి వెళ్ళనంది. 'ఇద్దరం కలిసి ఎక్కడయినా

దూరంగా వెళ్ళి బతుకుదాం.' అంది. నేను సరే అనక తప్పలేదు. ఇద్దరం కలిసి ఓ మిత్రుని వూరికి బస్సులో వెళ్తుండగా బస్సు ప్రమాదానికి గురయ్యింది. కొందరు ప్రమాదం జరిగిన స్థలంలోనే చనిపోయారు. మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. నాకూ నీరజకు కూడా! మేము ప్రమాదం జరిగిన స్థలం వద్దే స్పృహ కోల్పోయాము. నేను తిరిగి స్పృహలోకి వచ్చేసరికి మూడు రోజులకు పైగా పట్టింది. నేను నీరజ కోసం వెతికాను. కానీ నీరజ..'' అంటూ చెప్పడం ఆపాడు. దుఃఖం ఉబికివస్తుండగా.

''నీరజకేమయ్యింది?'' ఆత్రంగా ప్రశ్నించింది మంగమ్మ.

ఏడ్పు కంఠంతోనే సమాధానం చెప్పాడు ప్రసాద్.

''నీరజ హాస్పిటల్లో జాయిన్ చేయబడ్డ రోజే, అధిక గాయాల కారణంగా, మరణించిందట. మృతుల ఫోటోలు పేపర్లో ప్రకటిస్తే, ఆమె తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్ళారు. అని డాక్టర్లు చెప్పారు. నీరజను చివరి చూపుకు కూడా నోచుకోలేకపోయాను. నాకయిన గాయాలు మానాక నన్ను డిశ్చార్జ్ చేశారు. వూరికి వెళ్ళాలనిపించలేదు. కళ్ళ ముందు అనుక్షణం నీరజ రూపమే అగుపించ సాగింది. నీరజలేని ఈ జీవితం ఎందుకు? అన్న విరక్తి భావం కలిగింది. చచ్చిపోవాలనుకొన్నాను. ఎందుకో మరి ఆ సాహసం చేయలేకపోయాను. అప్పట్నుంచి వూళ్ళు పట్టుకొని తిరుగుతూ.. చివరికి మీ వద్దకు చేరాను.'' చెప్పటం పూర్తిచేసి కన్నీటిని తుడుచుకున్నాడు ప్రసాద్.

ప్రసాద్ చెప్పింది విన్న మంగమ్మ మనసులో కూడా బాధ కలిగింది అయినా తనకు చెప్పాలనిపించింది ఇలా చెప్పింది.

''ఆ అమ్మాయి అలా చనిపోవటం చాలా బాధను కలిగించే విషయమే! అలాగని చనిపోయినవారి కోసం వున్న జీవితాన్ని పాడుచేసుకోవటం పిచ్చితనమౌతుంది. ఆమెను మెల్లిగా మరచిపోయి బతుకుపోరాటం సాగించాలి. ఇలా వూళ్ళు పట్టుకొని తిరగటం వల్ల ప్రయోజనం ఏమీ లేదు. నా విషయమే తీస్కో! మా అమ్మ నా చిన్నప్పుడే చనిపోయింది. మా అయ్య నన్ను పదోతరగతి వరకూ చదివించాడు. ఇంకా చదువుకొంటాను అని అన్నా వినకుండా నన్ను తనలాంటి తాగుబోతుకే ఇచ్చి కట్టబెట్టాడు. వాడి వెధవ పనులు భరించలేక, వాడ్ని వొదిలేసి స్వంతంగా ఇలా ఈ కాక హోటల్ పెట్టుకొని బతుకుతున్నాను. నీవూ అట్లాగే ధైర్యంగా బ్రతకాలి. నీవు ఎంత వరకు చదివావు?''

''ఎం.ఏ దాకా చదివాను.'' సమాధానమిచ్చాడు ప్రసాద్?

''మరి ఇంత చదువు వుంచుకొని, ఇలాంటి జీవితానికి అలవాటు పడితే ఎలా? మీ వూరెళ్ళు లేదా నీవు చదువుకున్న సిటికెళ్ళు! నీకున్న చదువుతో ఏదో ఓ ఉద్యోగం చూసుకో! కొత్త జీవితం మొదలు పెట్టు. ఇలా హోటల్లో పని చేయటం వల్ల నీ జీవితం బాగుపడదు. నీవు వెళ్ళడానికి కొంత డబ్బిస్తాను. వెళ్ళిపో! వెళ్ళి నీ భవిష్యత్‌ను బాగుపరచుకో!'' చెప్పింది మంగమ్మ.

'సరే' అంటూ తలూపాడు ప్రసాద్.

***

ఓ రోజు హఠాత్తుగా తన భర్త మరణించాడన్న వార్త మంగమ్మకు చేరింది. 'నాదృష్టిలో ఏనాడో చచ్చాడు! ఇప్పుడు కొత్తగా చచ్చేదేముంది?' అనుకొంది మంగమ్మ. సాయంకాలానికి కుల పెద్దలు వచ్చారు.

''భర్త చచ్చాడు కాబట్టి విధవవు కమ్మని చెప్పారు.

''నేను కానంది..'' మంగమ్మ.

బలవంతంగా ఆమెను లాక్కొని తీసుకోబోయారు. వారిని విదిలించుకుని సివంగిలా అరచి చెప్పింది మంగమ్మ. ''ఏ నాకొడుకైనా నా ఒంటి మీద మళ్ళీ చెయ్యి వేశారో వాడి ప్రాణం తీస్తాను జాగ్రత్త! ఆ నా కొడుకు తాగి, తందనాలాడుతూ, రంకు ముండల్తో తిరుగుతున్నప్పుడు ఒక్కడయినా వాడ్ని మార్చి, నా వద్దకు పంపారా? లేదే? ఈరోజు ఏ కల్తీ సారో తాగి వాడు చస్తే, వచ్చి ముండమోయమంటున్నారా? మీరేం కులపెద్దల్రా? మీరేం పెద్దమనుషుల్రా? రేయ్! ముంతకల్లుకు, మున్నూరు దుడ్లకు అమ్ముడు పోయే దగుల్బాజీ నాయాల్లారా! అంతగా ముండ మోయించాలనుకొంటే, ఎళ్లి ఆడితో పడుకొన్నారే రంకుముండలు, ఆళ్ళతో ముండ మోయిచ్చండి! నేనెందుకు ముండ మోయాల్రా? ఏనాడయినా వాడు, నన్ను కట్టుకున్న ఆలిగా చూశాడా? కట్టుకున్న కాడ్నుంచి కాల్చుకుతిన్నాడు. అట్లాంటి పడిసెట్టు నాయాలు కోసం నేనుకాదురా! ఏ ఆడది కూడా ముండ మోయదు. అట్లా చూస్తారేం రా ఎల్లుండి! ఎళ్ళకపోయారో నాకు తెలిసిన ఎస్సయితో చెప్పి మీ అందర్నీ బొక్కలో తోయిస్తా.

పొండ్రా గబ్బు నాయాల్లారా! ముండమోయాలంట.. మీ బతుకులు సెడ..థూ!'' అంటూ కాండ్రించి వారి ముందే ఉమ్మింది. కొందరు కోపంగా ముందుకు రాబోయారు. రత్తయ్యలో ఆవేశం.

ఒక్కడుగు ముందుకు వేశారంటే, ఈ కత్తితో తెగ నరుకుతా!'' వంట చెరుకును నరికేందుకు ఉపయోగించే కత్తిని వారిపైకి ఎత్తాడు రత్తయ్య.

కాస్త వెనక్కు తగ్గారు కులపెద్దలు.

''సిగ్గిడిసిన దాంతో మనకేంట్రా.. పోదాం. పదండ్రా'' అంటూ వెనక్కు కదలబోతుండగా ''ఎవడ్రా సిగ్గిడిసింది. మీరు. మీరే సిగ్గిడిసి వచ్చినారు'' అంటూ కత్తితో వారిపైకి వురికాడు రత్తయ్య. కులపెద్దలు ప్రాణభయంతో తలో దిక్కుకు పరుగుతీశారు.

మంగమ్మ రత్తయ్య వంక కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ అంది.

''రేయ్ రత్తయ్యా! నీకు అయ్యా, అబ్బా లేదు. ఊహ తెలిసినప్పటినుంచి ఆ ఈ హోటళ్ళలో పని చేస్తూ, చివరికి నా దగ్గరికి వచ్చి చేరావు. 'అక్కా' అని నోరారా పిలిచావు. ఇప్పుడు నిజమైన తమ్ముడివై నీ బాధ్యతను నెరవేర్చావు. రక్తం పంచుకొని పుట్టకపోయినా నిజంగా నీవు నా తమ్ముడివేరా! నా తమ్ముడివే!'' మంగమ్మ కంట్లో కన్నీరు.

***

కొన్నాళ్ళు గడిచాయి. ప్రసాద్ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అందులో–

మంగమ్మగార్కి,

ఎన్ని ఆటుపోట్లకు గురయినా, మనిషి మనోధైర్యం వీడక, పోరాటం సాగిస్తూ వెళ్ళడమే జీవితం అన్న నగ్న సత్యాన్ని మీ వల్ల తెలుసుకొన్నాను. మీరిచ్చిన డబ్బుతో సిటికి వచ్చి, తీవ్ర ప్రయత్నంతో, చివరికి ఓ ప్రయివేట్ సంస్థలో ఉద్యోగం సంపాదించుకొన్నాను. జీవితం పట్ల ఆశను, ఆత్మవిశ్వాసాన్ని కలిగించిన మీకు సర్వదా కృతజ్ఞుడ్ని! జీతం రాగానే మీరిచ్చిన డబ్బు ఎం.ఓ. చేస్తాను.

ఇట్లు
ప్రసాద్.

ప్రసాద్ వ్రాసిన ఉత్తరాన్ని చదువుకొన్న మంగమ్మ మనసులోనే చిన్నగా నవ్వుకొని తిరుగు ఉత్తరం ఇలా వ్రాసింది.

ప్రసాద్ గార్కి, మీరు ఉద్యోగం సంపాదించుకొన్నందుకు చాలా సంతోషంగా వుంది. మీరు డబ్బేమీ పంపక్కర్లేదు. కొన్ని సంఘటనల వల్ల జీవిత గమ్యం తప్పి ప్రయాణిస్తూ వుంటారు. అలాంటి వారు ఎదురైనపుడు, వారిలో జీవితంపై ఆశను నింపండి! చేతనయితే కొద్దిపాటి ఆర్థిక సహాయం చేయండి! మనిషికి మనిషికి మధ్య వుండవలసింది ఇదే. నేను మీలా పెద్ద చదువులు చదువుకోలేదు. జీవితం నేర్పిన అనుభవంతో ఈ నాలుగు మాటలు వ్రాస్తున్నాను.

వుంటాను.
ఇట్లు
మంగమ్మ.

